**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**శ్రీయుత నారా చంద్రబాబు నాయుడు గారికి,** **తేదీ : 05.12.2015**
గౌరవ ముఖ్యమంత్రి, **విజయవాడ**
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. – **ఆర్.లక్ష్మయ్య,** ఆఫీస్ కార్యదర్శి

ఆర్యా!

**విషయం: అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను సేకరించినప్పుడు పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ...**

రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది ఎకరాల భూములను సేకరిస్తున్నది. పరిశ్రమలకు ల్యాండ్ బ్యాంక్ పేరుతో 7,82,296 ఎకరాలను గుర్తించారు. అందులో సుమారు 1,65,000 ఎకరాలు అసైన్డ్ భూములు, దాదాపు 5,15,000 ఎకరాలు ప్రభుత్వ భూములున్నాయి. వీటిని రైతాంగం – దళితులు, గిరిజనులు బలహీనవర్గాలవారు సాగుచేస్తున్నారు. కానీ పలు జిల్లాల్లో అసైన్డ్ భూములకు ప్రభుత్వ భూములకు 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుండా అధికారులు భూములు స్వాధీనం చేసుకుంటున్నారు. రైతులను భూములనుండి వెళ్ళగొడుతున్నారు. విశాఖపట్నం జిల్లాలో లాజిస్టిక్ పార్క్ పేరిట అసైన్డ్ భూములు తీసుకొని ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని అనకాపల్లి తహసిల్దార్ 04.09.2015న ఉత్తర్వులిచ్చారు.ఇది చట్టవిరుద్ధం. ఇలాంటివి రాష్ట్రమంతటా జరుగుతున్నాయి. ఇది రైతు వ్యతిరేకమేగాక చట్ట ఉల్లంఘన. కోర్టు ధిక్కారంగా పరిగణించవలసి వస్తుంది. ఆ భూముల్ని ప్రభుత్వం తీసుకుంటే వారు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతారు. ఆ భూమిని ప్రభుత్వం తీసుకుంటే వారికి పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించడం అవసరం. భూసేకరణ చట్టం (2013)–సెక్షన్ 3 – ఆర్ (iii) ప్రకారం అసైన్డ్ భూములు సాగుచేసుకొనేవారు కూడా భూయజమాని (ల్యాండ్ ఓనర్) నిర్వచనం పరిధిలోకి వస్తారు.

ఏడుగురు న్యాయమూర్తులుతో కూడిన రాష్ట్ర హైకోర్టు విస్తృత ధర్మాసనం 2004 మార్చి9న (కేసు నెం: డబ్ల్యూ.ఎ 170/2002) ఇచ్చిన తీర్పులో అసైన్డ్ భూముల యజమానులకు కూడా జిరాయితీ భూములతో సమానంగా పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలని (పేరా – 109) ఆదేశించింది. అసైన్డ్ భూములకు మార్కెట్ విలువతోసహా పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించకుండా భూమిని సేకరించడం రాజ్యాంగ విరుద్ధమని (పేరా 108) కూడా పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 31–ఎ లను ఉల్లంఘించడమేనని స్పష్టంగా తెలిపింది.

భూసేకరణ చట్టం, హైకోర్టు విస్తృత ధర్మాసనం తీర్పు విస్పష్టంగా పేర్కొన్న ఈ అంశాన్ని తు.చ. తప్పక అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వం సేకరించిన అసైన్డ్ భూములకు జిరాయితీ భూములతో సమానమైన పరిహారాన్ని చెల్లించాలని కోరుతున్నాము. చట్టాన్ని, అలాగే హైకోర్టు తీర్పును అమలు చేయాలని అసైన్డ్ భూముల లబ్ధిదారులు న్యాయస్థానాలను ఆశ్రయించకముందే వారికి పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న అసైన్డ్, ప్రభుత్వ భూములకు ఆయా అనుభవదారులందరికీ పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నాము.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి